ధర్మారంలోని సాయి మణికంఠ మోడ్రన్ హై స్కూల్ భవనం

బోధనలో అగ్రగామిగా నిలుస్తున్న

సాయి మణికంఠ మోడ్రన్ హై స్కూల్

ధర్మారం,ఆగస్టు 4: మండల కేంద్రం లోని సాయి మణికంఠ మోడ్రన్ హై స్కూల్ ఉత్తమ బోధన, తల్లిదండ్రుల మన్ననలతో అగ్రగామిగా నిలుస్తున్నది. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు పట్టణ స్థాయి విద్యతో పాటుగా ఉన్నతమైన విలువలు, సామాజిక బాధ్యతను పెంపొందించాలనే లక్ష్యంతో 2003-04లో జైన సురేశ్ కుమార్, రమాదేవి దంపతులు ఇంగ్లిష్ మీడియం స్కూల్‌ను స్థాపించారు. కేవలం100 మందితో ప్రారంభమైన పాఠశాల నేడు పెద్ద సంఖ్యలో విద్యార్థులతో విలసిల్లుతుంది. జిల్లా స్థాయిలో ఉత్తమ పాఠశాలల్లో ఒకటిగా నిలుస్తున్నది. దినదినాభివృద్ధి చెందిన పాఠశాల సొంత భవనంలో బోధన చేసే స్థాయికి ఎదిగింది.

సాంకేతిక పరిజ్ఞానంతో బోధన

విద్యార్థుల నైపుణ్యాన్ని మెరుగుపరిచేందుకు అందుబాటులో ఉన్న అన్ని రకాల సాంకేతిక పరిజ్ఞానంతో విద్యా బోధన చేస్తున్నాం. దీంతో విద్యార్థులు ఏటా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. ఎస్సెస్సీలో 10 జీపీఏతో పాటు నవోదయలో రెండు నుంచి నాలుగు సీట్లు సాధిస్తున్నారు. డిజిటల్ తరగతుల ద్వారా విషయ పరిజ్ఞానాన్ని పెంపొందిస్తున్నాం. సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ లెర్నింగ్ (సీఎఫ్ఈఎల్) ద్వారా అడ్వాన్స్ ఇంగ్లిష్ నైపుణ్యాన్ని మెరుగుపరుస్తున్నాం. 21 ఏళ్లుగా 1200 మంది విద్యార్థులు పదో తరగతి ఉన్నత స్థాయిలో ఉన్నారు. డాక్టర్లు, లాయర్లు, ఇంజినీర్లతో పాటు ఇతర రంగాల్లో స్థిరపడడం ఆనందంగా ఉంది. గ్రామీణ ప్రాంతంలోని విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యనందించడమే మా లక్ష్యం.

జైన సురేశ్ కుమార్, కరస్పాండెంట్, జైన రమాదేవి ,ఎండీ

పోగొట్టుకున్న పర్సు అప్పగించిన మున్సిపల్ సిబ్బంది

పర్సు అప్పగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

పెద్దపల్లి టౌన్, ఆగస్టు 4: చందపల్లికి చెందిన నెత్తెట్ల చంద్రయ్య ఆదివారం పెద్దపల్లికి వచ్చే క్రమంలో దారిలో రూ. 22 వేల నగదు ఉన్న పర్సు పోగొట్టుకున్నాడు. ఆ పర్సు మున్సిపల్ బిల్ కలెక్టర్ సింగారపు శ్రీనివాస్‌కు దొరికింది. దీంతో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్‌కు సమాచారం అందివ్వగానే, పర్సు పోలీసులకు అప్పగించాలని సూచించారు. కొద్దిసేపటికి తన పర్సు పోయిందని చంద్రయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దొరికిన పర్సు ను పోలీసుల సమక్షంలో మున్సిపల్ సిబ్బంది బాధితుడు చంద్రయ్యకు అప్పగించారు. దొరికిన పర్సు అందజేసిన శ్రీనివాస్‌కు, పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామ్మోహన్‌రెడ్డి, చిన్న, రాజు, సాగర్ ఉన్నారు.

గోదావరిఖని 42వ డివిజన్ పరిధి ప్రధాన వ్యాపార కేంద్రంలోని రోడ్డు దుస్థితి

బురద నీటిలో బైఠాయించి నిరసన తెలుపుతున్న 25వ డివిజన్ కార్పొరేటర్(ఫైల్)

ఇది నగరం కాదు..నరకం

- అప్పుడు అద్దంలా మెరిసిన రోడ్లు... ఇప్పుడు అధ్వాన్నం
- కళ్యాణ్ నగర్ కష్టాలు తీరేదెప్పుడో..
- నాడు ఇదే రోడ్డు కోసం ధర్నా చేసిన ప్రస్తుత ఎమ్మెల్యే
- గాడి తప్పిన రామగుండం కార్పొరేషన్

కోల్‌సిటీ, ఆగస్టు 4: 'పేరు గొప్ప... ఊరు దిబ్బ..' అనే సామెత రామగుండం నగర పాలక సంస్థకు సరిగ్గా సరిపోతుంది. పేరుకే నగరమని చెప్పుకోవడం తప్ప.. ఇక్కడి రోడ్ల మీద వెళ్తే మాత్రం నరకం కనిపిస్తుందంటున్నారు ఇక్కడి ప్రజలు. రామగుండం కార్పొరేషన్ అభివృద్ధికి రూ.100 కోట్లు వచ్చాయని చెప్పుకోవడమే తప్పితే... ఇప్పటి వరకు ఆ నిధులతో ఎక్కడా అభివృద్ధి పనుల జాడే కనిపించడం లేదు. నాడు అద్దంలా మెరిసిన రోడ్లు.. ఇప్పుడు అధ్వాన్నంగా మారిన దుస్థితిని చూసి నగర ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. నగరానికి ప్రధాన వ్యాపార కేంద్రంగా ఉన్న లక్ష్మీనగర్, కల్యాణ్‌నగర్, మేదరిబస్తీల్లో రోడ్లను చూస్తే ఇదేనా మార్పు అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. 10 నెలలుగా రామగుండం కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశాలు పత్తా లేకుండా పోవడంతో అభివృద్ధి కూడా అంతకంతకు అటకెక్కిందని పలువురు కార్పొరేటర్లే బాహాటంగా చెబుతున్నారు. గాడి తప్పిన రామగుండం కార్పొరేషన్‌ను చక్కదిద్దే పరిస్థితి కానరావడం లేదంటూ వాపోతున్నారు.

ఈ రోడ్లు చూడతరమా...

నగరంలోని ప్రధాన వ్యాపార కూడళ్లయిన కళ్యాణ్‌నగర్, మేదరిబస్తీ, లక్ష్మీనగర్‌లోని రోడ్లు అధ్వాన్నంగా మారాయి. రోడ్లు మొత్తం ఎక్కడికక్కడ గుంతలు పడ్డాయి. బజారుకు వెళ్లొస్తుంటే నరకానిక జానెడు దూరం వెళ్లి తిరిగి వచ్చినట్లు అవుతుందని వాహన చోదకులు విమర్శిస్తున్నారు. ప్రధాన చౌరస్తా నుంచి హనుమాన్ నగర్‌కు వెళ్లే రోడ్డు పూర్తిగా ఆనవాళ్లు కోల్పోయింది. లక్ష్మీనగర్‌కు వచ్చే దారి కూడా మొత్తం గుంతలు పడి కాలి నడకన వెళ్లడం కూడా కష్టంగా మారింది. రమేశ్ నగర్ నుంచి అడ్డగుంటపల్లి, తిలక్‌నగర్, కళ్యాణ్‌నగర్, ద్వారకానగర్‌కు వెళ్లే రోడ్లు పూర్తిగా అధ్వాన్నంగా మారడంతో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. 25వ డివిజన్ పరిధిలోని ఆర్టీసీ కాలనీ, పద్మావతి కాలనీ, కేసీఆర్ కాలనీ, ప్రగతినగర్, సాయినగర్, టీచర్స్ కాలనీ, బృందావనం కాలనీలో రోడ్లు గుంతలు పడి ప్రజలకు శాపంగా మారాయి. ఈ డివిజన్‌లో గతంలో రోడ్డు అభివృద్ధి పనులకు గతంలో టెండర్లు పిలిచి ఆ పనులను మొదట్లోనే నిలిపివేశారు. ఇటీవల అక్కడి మహిళా కార్పొరేటర్ నగునూరి సుమలత-రాజు ప్రధాన రోడ్డుపై ఉన్న బురద నీటిలో బైఠాయించి నిరసన తెలిపారు. ఇప్పటికీ ప్రజాప్రతినిధులు అటు వైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదు.

కల్యాణ్‌నగర్ కష్టాలు తీరెదెప్పుడు...?

నగరంలో ప్రధాన వ్యాపార కేంద్రం కల్యాణ్‌నగర్. ఇక్కడి రోడ్లు చూస్తే బెంబేలెత్తిపోయేలా ఉన్నాయి. కోరుకంటి చందర్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఇదే కళ్యాణ్‌నగర్ రోడ్లపై పోరాటం అంటూ కాంగ్రెస్ పార్టీ ఒక రోజు బంద్ కూడా చేపట్టింది. ప్రస్తుత ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ ఇదే కల్యాణ్‌నగర్ చౌరస్తాలో ధర్నా కూడా చేశారు. దీనితో అప్పుడు స్పందించిన కోరుకంటి చందర్ ఆ డివిజన్‌లో రోడ్డు మంజూరు చేయించి భూమిపూజ కూడా చేశారు. రోడ్డు మధ్యలో ముందుగా భూగర్భ డ్రైనేజీ పనులు పూర్తి చేశారు. ఇప్పుడు పరిస్థితి చూస్తే... అప్పుడు రోడ్డు కోసం ధర్నా చేసిన ప్రస్తుత ఎమ్మెల్యే ఈ సమస్యపై ఎందుకు చొరవ చూపడం లేదని వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు. ఆ డివిజన్ కార్పొరేటర్ సైతం కాంగ్రెస్ పార్టీలో ఉండటంతో ఎవరికీ చెప్పుకోలేని పరిస్థితి నెలకొంది.

సీఓటీ అనుమతి రాగానే చేపడుతాం..

కల్యాణ్‌నగర్, లక్ష్మీనగర్ తదితర వ్యాపార కేంద్రాల్లో రోడ్ల అభివృద్ధికి రూ.26 కోట్ల నిధులు కేటాయించారు. అయితే రూ.10 కోట్లు పైబడి నిధులతో పనులు చేపట్టాలంటే కమిషనర్ ఆఫ్ టెండర్స్ (సీఓటీ) అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అందుకోసం గతంలోనే ప్రభుత్వానిక ప్రతిపాదనలు పంపించాం. ఈ అసెంబ్లీ సమావేశాలు పూర్తయ్యాక అనుమతి వచ్చే అవకాశం ఉంది. ఆ తర్వాతనే టెండర్లు పిలిచి రోడ్డు పనులు చేపడుతాం.

సీహెచ్ శ్రీకాంత్, రామగుండం కమిషనర్

800మెగావాట్ల ప్లాంటు ఏర్పాటు చేస్తాం

- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్ సింగ్

గోదావరిఖని, ఆగస్టు 4: రామగుండంలో 800మెగావాట్ల విద్యుత్ పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తామనిఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్ తెలిపారు. ఆదివారం గోదావరిఖనిలోని క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రజా సమస్యలపై మాట్లాడే అవకాశం ప్రభుత్వం కల్పించగా రామగుండంలో నూతనంగా విద్యుత్ కేంద్రం ఏర్పాటు, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావించినట్లు తెలిపారు. స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. నిరుద్యోగులకు భరోసాగా అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్‌ను ప్రవేశపెట్టామని, అంతర్జాతీయ స్థాయిలో క్రీడలకు ప్రోత్సాహం అందిస్తామని సీఎం హామీ ఇచ్చారని తెలిపారు. కాంగ్రెస్ కార్పొరేటర్లు, నాయకులు ఉన్నారు.

ఔషధం పంపిణీ

సుల్తానాబాద్, ఆగస్టు 4 : సుల్తానాబాద్‌లోని వేణుగోపాల స్వామి ఆలయంలో జ్ఞాపకశక్తి, రోగ నిరోధక శక్తిని పెంపొందించే ఔషధాన్ని వికాస తరంగిణి ఆధ్వర్యంలో ఆదివారం పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ పొన్నమనేని బాలాజీరావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి నెల పుష్యమి నక్షత్రం రోజున ఈ ఔషధం సేవించాలని వికాస తరంగిణి చీఫ్ కో-ఆర్డినేటర్ సాదుల సుగుణాకర్, పొదిళ్ల రమేశ్ తెలిపారు. కార్యక్రమంలో శ్రీరంగం నల్లాన్ చక్రవర్తులు వనజ, పొన్నమనేని స్వరూప, సాదుల సునీత, గొట్టం రమేశ్, అల్లాడి భగవాన్ ఉన్నారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 4: యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని, ప్రధానంగా ద్విచక్ర వాహనదారులు ప్రయాణంలో హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని బసంత్‌నగర్ ఎస్ఐ స్వామి సూచించారు. రాఘవాపూర్ గ్రామస్తులతో ఆదివారం సమావేశమయ్యారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గంజాయి, డ్రగ్స్ తీసుకుంటే చట్టపరమైన శిక్షలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధులకు నివాళి

పెద్దపల్లి/పెద్దపల్లి టౌన్, ఆగస్టు 4: స్వాతంత్ర్య సమర యోధుల త్యాగాలు మరువలేనివని స్వాతంత్ర్య సమరయోధుల వారసుల సంఘం జిల్లా అధ్యక్షుడు బాలసాని వెంకటేశం అన్నారు. అఖిల భారత స్వాతంత్ర్య సమరయోధుల వారసుల సంఘం పిలుపు మేరకు పెద్దపల్లి సుభాష్ నగర్‌లోని గాంధీ విగ్రహానికి పూల మాల వేసి జాతీయ గీతం ఆలపించారు. సంఘం నాయకులు కోలా వెంకటేశ్వర్ రావు, వెనగందుల శ్రీనివాస్, ఎరబెల్లి ఆనందరావు, కాచే సురేశ్, కే మురళీధరావు, ఎన్ రాము, కాచే కృష్ణ పాల్గొన్నారు.

నేత్రదానంతో ఇద్దరికి చూపు

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు4: మీర్జంపేట గ్రామానికి చెందిన రామిని తిరుపతమ్మ (67) మృతి చెందగా, ఆమె కండ్లను సదాశయ ఫౌండేషన్ ద్వారా హైదరాబాద్ ఐ బ్యాంక్ కు అప్పగించి ఆదర్శంగా నిలిచారు. సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు వెంకటేశ్వర్లు, చిదురాల శ్రీనివాస్ తిరుపతమ్మ కుటుంబ సభ్యులకు అవగాహన కలించగా, నేత్రదానానికి అంగీకారం తెలిపారు. మృతురాలి కుటుంబ సభ్యులను అభినందించారు.

సాధన కళాశాలలో అపూర్వ సమ్మేళనం

అధ్యాపకులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

ధర్మారం,ఆగస్టు4: మండల కేంద్రంలోని సాధన జూనియర్ కళాశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఏర్పాటు చేశారు. 2012-14 బ్యాచ్ విద్యార్థులు పూర్వ కళాశాలలో కలుసుకున్నారు. అప్పటి అధ్యాపకులను సన్మానించారు. అనంతరం వారంతా కళాశాలలో గడిపిన విషయాలను నెమరు వేసుకుని రోజంతా ఆనందంగా గడిపారు. సాంస్కృతిక కార్యక్రమాలతో ఉత్సాహంగా గడిపారు.

వైశ్య కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం

జ్యోతినగర్, ఆగస్టు 4: రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వల సుజాతను ఆదివారం ఎన్టీపీసీ ఆర్యవైశ్య సంఘం నాయకులు సన్మానించారు. రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ నూతన చైర్మన్‌గా ఎన్నికతో మంచిర్యాల్‌కు వెళ్తున్న కల్వల సుజాతకు ఎన్టీపీసీలో స్వాగతం పలికి శాలువతో సన్మానించారు. ఇక్కడ సంఘం నాయకులు చంద్రశేఖర్, హరీశ్, సభ్యులు ఉన్నారు.

ప్రమాదకరంగా ప్రభుత్వ పాఠశాల


పాఠశాల ఆవరణలో నిలిచిన వర్షం నీరు

జూలపల్లి, జూలై 27 : చర్లపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ప్రమాదకరంగా మారింది. సమస్యల వలయంలో చిక్కుకుని విలవిలలాడుతోంది. ఇందులో ఒకటి నుంచి ఏడో తరగతిలో 50 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఆరుగురు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. దాదాపు 40 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ పాఠశాల భవనం పగుళ్లు పడి, పై కప్పు పెచ్చులూడుతున్నాయి. కనీసం మరమ్మతులు లేకుండా పోయాయి. ప్రభుత్వం ఇటీవల 'అమ్మ ఆదర్శ' కమిటీల ద్వారా పలు పాఠశాలల్లో వసతుల కల్పన, మరమ్మతులు చేపట్టి, చర్లపల్లి పాఠశాలను విస్మరించడంపై మండిపడుతున్నారు. శిథిల భవనంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు బిక్కు బిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. చిన్నపాటి వానలకు తరగతి గదులు, వరండాలో నీరు నిలిచి ఇబ్బందులు ఎదొర్కొంటున్నారు. వర్షం నీటితో పాఠశాల ఆవరణ చిన్నపాటి కుంటలా తలపిస్తుంది. పాఠశాల ఖాళీ చేసి గ్రామంలోని కుర్మసంఘం సామాజిక భవనంతోపాటు, ఓ ఇంట్లో తరగతులు నిర్వహిస్తున్నారు. తరగతుల నిర్వహణ ఓ చోట, మధ్యాహ్న భోజనం మరో చోట ఏర్పాటు చేయడంతో అవస్థలు పడుతున్నారు. భవనం ప్రమాదకరంగా మారిందని హెచ్ఎం యోగేంద్రప్రసాద్ జూన్ 22న డీఈవో మాధవికి వినతి పత్రం అందజేశారు. అప్పటి నుంచి కనీసం అధికారులు పాఠశాలను సందర్శించి సమస్యలు తెల్సుకోలేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యేను కలిసిన డీసీహెచ్ఎస్ వైద్యుడు

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 4: పెద్దపల్లి ప్రభుత్వ దవాఖాన డీసీహెచ్ఎస్‌గా నియమితులైన డాక్టర్ శ్రీధర్ ఆదివారం పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు ఎమ్మెల్యే నివాసంలో కలిసిన డాక్టర్ డీసీహెచ్ఎస్ ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు.

వెదురు అక్రమ రవాణా

జూలపల్లి, ఆగస్టు 4 : జూలపల్లి మీదుగా వెదురు గుట్టు చప్పుడు అక్రమంగా కాకుండా తరలిస్తున్నారు. ధర్మారం మండలం కొత్తూరు శివారులోని పాండవుల గుట్టల్లో కొంత మంది విచ్చల విడిగా వెదురు నరికేస్తున్నారు. జూలపల్లి నుంచి చొప్పదండి, కరీంనగర్ ప్రాంతాలకు పెద్ద ఎత్తున తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని పర్యావరణ ప్రేమికులు పేర్కొంటున్నారు. మొక్కుబడిగా అధికారులు తనిఖీల పేరుతో పట్టుకుని జరిమాన విధించినా అక్రమ వ్యాపారానికి అడ్డుపడడం లేదు. జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి సహజ వనరులు కాపాడాలని కోరుతున్నారు.

దళిత సంఘాల సంబురాలు

జ్యోతినగర్(రామగుండం), ఆగస్టు 4: షెడ్యూల్ కులాల వర్గీకరణను సమర్థిస్తూ సుప్రీంకోర్టు ఈ నెల 1న ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ ఆదివారం రామగుండం అంబేద్కర్ చౌరస్తాలో దళిత సంఘాల నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళుల ర్పించి, స్థానికులకు స్వీట్లు పంపిణీతో సంబురాలు నిర్వహించుకున్నారు. ఇక్కడ ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు బుషిపాక సంతోశ్ మహారాజ్, రామగుండం కార్పొరేషన్ అధ్యక్షుడు కుక్క గంగాప్రసాద్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొండల రాజేందర్, అంబేద్కర్ సంఘం నాయకులు మనమళ్ల రమేశ్, నాయకులు కల్వల రాయమల్లు, ఈదునూరి పోచం, సుందిల్ల సదానందం, జూల రవి, దారంగుల కుమార్, సదానందం, సాయిలు, శంకర్, బాబు, మల్లేశ్, తిరుపతి, భానుచందర్, నాతరి మోజెస్, శ్రీనివాస్, భీమ శ్రీనివాస్, రాయలింగు, గంగారం మహేందర్‌లు ఉన్నారు.

ఎస్టీల వర్గీకరణ చేపట్టాలి

గోదావరిఖని/కోల్‌సిటీ, ఆగస్టు 4: రాష్ట్ర ప్రభుత్వం ఎస్టీల ఎబీసీడీ వర్గీకరణ చేపట్టాలని తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు డిమాండ్ చేశారు. ఆదివారం గోదావరిఖనికి వచ్చిన ఆయన చౌరస్తాలోని అమరు ల స్తూపం వద్ద నివాళులర్పించారు. రాష్ట్రంలో ఎస్టీల్లో 13, 14 తెగలు ఉన్నాయని, అందులో కొన్ని ఉపకులాలు పూర్తి ఆర్థికంగా,సామాజికంగా వెనుకబడి ఉన్నా యన్నారు. వారికి ప్రభుత్వ ఫలాలు సరి గా అందడం లేదన్నారు. సుప్రీం కోర్టు తీర్పును రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేసి వర్గీకరణ చేపట్టాలన్నారు. ఇక్కడ ఆదివాసీ ఎరుకల సంఘం జిల్లా కన్వీనర్ బిజిలి సతీశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనేటి రాజు, రేవెల్లి రాకేశ్, బిజిలి సతీశ్, అంగిడి కుమార్, కుతాడి శ్రీనివాస్, దుద్యాల బాపు, కెమసారం సారయ్య, లోగిని ఎల్లయ్య, మానుపాటి రవి, సార్ల రవి, పోశం, సమ్మయ్య, రేవెల్లి సంపత్, అంజి, సార్ల తిరుపతి ఉన్నారు.

ఇంపాక్ట్ శిక్షణకు మేజిక్ రాజా

కోల్‌సిటీ, ఆగస్టు 4: ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సంస్థ నిర్వహణలో ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ గంప నాగేశ్వరరావు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని కళాభవన్‌లో ఈనెల 1,2,3 తేదీల్లో జరిగిన వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులకు గోదావరిఖనికి చెందిన మోటివే షనల్ స్పీకర్ మేజిక్ రాజా హాజరయ్యారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత చొక్కాపు వెంకటరమ తయారు చేసిన పర్సనాలిటీ డెవలప్‌మెంట్ మోటివేషన్ కార్డుల సెట్ 'కథాకేళి'ని రాజాకు బహుకరించారు.

డాక్టర్ మహేందర్‌కు పరామర్శ

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 4: ఇటీవల దాడికి గురైగాయపడిన డాక్టర్ మహేందర్‌ను నిట్టూరులో పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు ఆదివారం పరామర్శించారు. దాడి ఘటనకు సం బంధించిన వివరాలను డాక్టర్ మహేందర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట నాయకులు ఎనగందుల ప్రదీప్, నారా యణ, గిర్నేని సంపత్‌రావు, మాదారపు ఆంజనేయరావులతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు..

స్నేహితుడికి ఆర్థిక సాయం

పెద్దపల్లి, ఆగస్టు4: పెద్దపల్లి పట్టణానికి చెందిన కొలిపాక సతీశ్ అనారోగ్యంతో పాటు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. విషయం తెలుసుకున్న అతని స్నేహితులు వైద్య ఖర్చుల కోసం రూ.21వేలు సాయం చేశారు. ఆదివారం సతీష్ ఇంటికి వెళ్లి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో భూతగడ్డ శ్రీనివాస్, సదయ్య, నర్సింగ్, అశోక్, బొడ్డుపల్లి సురేశ్, వనపర్తి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు : ద్విచక్రవాహనం ఢీ

మంథని, ఆగస్టు4: ఆర్టీసీ బస్సును ద్విచక్ర వాహనం ఢీ కొన్న సంఘటన ఆదివారం మంథని మున్సిపల్ పరిధిలోని గంగపురి వద్ద చోటుచేసుకుంది. మంథని డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు (టీఎస్ 08 జెడ్ 0086) మంథని నుంచి హైదరాబాద్‌కు వెళ్లే క్రమంలో గంగపురి మూలమలుపు వద్ద ప్రమాదం సంభవిం చింది. ముత్తారం నుంచి మంథనికి వస్తున్నటువంటి ద్విచక్ర వాహనం వేగంగా ఆర్టీసీ బస్సుకు తగలడంతో ద్విచక్ర వాహనం కింద పడింది. ద్విచక్ర వాహనం వెనుకాల కూర్చున్న దండు పోచయ్యకు ప్రమాదంలో కాలు విరిగింది. క్షతగాత్రులను మంథని సామాజిక దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న మంథని పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

33వ డివిజన్‌లో అక్షరభ్యాసం

కోల్‌సిటీ, ఆగస్టు 4ః రామగుండం నగర పాలక సంస్థ 33వ డివిజన్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో కార్పొరేటర్ దొంత శ్రీనివాస్ ఆధ్వర్యంలో పిల్లలకు అన్నప్రాసన, సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఈ సెంటర్ పరిధిలోని గర్భిణులు, బాలింతలకు తల్లి పాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు భాగ్యలక్ష్మి, శ్రీమాల, పీహెచ్‌సీ సీఈఓ సునీత, స్టాఫ్ నర్సు విజయ, స్వర్ణ, ఆశ వర్కర్ సావిత్రి, అంగన్‌వాడీ ఆయా సలీమా, డివిజన్‌కు చెందిన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గంగమ్మ తల్లి బోనాలు

జూలపల్లి, ఆగస్టు 4 ః పెద్దాపూర్‌లో ఆదివారం భక్తుల ఆనందోత్సహాల మధ్య గంగమ్మ తల్లి బోనాల వేడుకలు నిర్వహించారు. మహిళలు బోనాలతో దేవతామూర్తులకు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. రఘువీర్ సింగ్‌ను గంగపుత్ర సంఘం సభ్యులు సన్మానించారు. ఇక్కడ సంఘం నాయకులు పెద్దపెల్లి రాజేందర్, ఆనంద్, సాయినాథ్, సత్యసాగర్, రాములు, రామస్వామి, రవి, శంకర్, శ్రీనివాసరాజు, శంకర్‌రావు, సాంబమూర్తి, అంజయ్య పాల్గొన్నారు.

సీఎం వ్యాఖ్యలు సరికాదు

ఫర్టిలైజర్‌సిటీ, ఆగస్టు 4: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బాధ్యతా రాహిత్యంతో ప్రైవేట్ ఉపాధ్యాయులపై చేసిన వ్యాఖ్యలు సరికాదని, వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరమ్ జిల్లా అధ్యక్షుడు ఆవుల రాజేశ్ యాదవ్ ప్రకటనలో డిమాండ్ చేశారు. బాధ్యతాయుతమైన స్థాయిలో ఉండి ప్రవేటు పాఠశాలలో ఇంటర్, డిగ్రీ ఫెయిల్, మీకన్నా(ప్రభుత్వ ఉపాధ్యాయులు) సగం చదువు చదవనోల్లు ప్రవేటు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారనడం సీఎం స్థాయికి తగదన్నారు. ప్రవేటు పాఠశాలలు, అందులో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ప్రభుత్వ అనుమతితో పనిచేస్తారనే విషయాన్ని మరిచి ప్రవేటు టీచర్లను అమమానించేలా మాట్లాడడం సరికాదన్నారు. సీఎం తన వ్యాఖ్యలు ఉపసంహరించుకోకుంటే ఆందోళనలు చేపడుతామన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

మంథని, ఆగస్టు4 : మంథని హమాలీ సంఘం కార్యవర్గం ఎన్నికైంది. ఎన్నికల అధికారిగా కాశెట్టి సురేశ్ వ్యవహరించారు. అధ్యక్షుడిగా అయిలి సంతోష్, ఉపాధ్యక్షునిగా ఐలి సతీశ్, ప్రధాన కార్యదర్శిగా గుర్రాల రామకృష్ణ, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్మికుల సమస్య కోసం కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన కార్యవర్గం సభ్యులు తెలిపారు. ఈమేరకు నూతన కమిటీకి కార్మికులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మంథని, ఆగస్టు4: మంథని ప్రభుత్వ డిగ్రీ కళాశాల 2004 -2007 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం క్షఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూర్వ ప్రిన్సిపాళ్లు ముష్బుద్దీన్, దాదాసలాం, లెక్చరర్లు కమలారని రజినీ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గురువులకు సన్మానం చేశారు. భవిష్యత్తులో బ్యాచ్ తరపున ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సుమంత్ రెడ్డి, సతీశ్, సంతోష్, అశోక్ రెడ్డి , సంధ్య, సరి త, అనిత పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల కనీస వేతనం అమలు చేయాలి

గోదావరిఖని, ఆగస్టు 4: పరిశ్రమల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాల జీవోను అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో జరిగిన యూనియన్ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రతిపక్షంలో ఉండగా కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై స్పందించిన కాంగ్రెస్ ఇప్పుడు వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రధానంగా 22వ జీవోను గెజిట్ చేయాలని ఆయన కోరారు. ఇక్కడ ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఏ వెంకన్న, జిల్లా అధ్యక్షుడు ఈ నరేశ్, ప్రధానకార్యదర్శి బీ అశోక్, ఉపాధ్యాక్షులు చిలుక శంకర్, సహాయ కార్యదర్శి కోండ్ర మొగిళి, కోశాధికారి డీ బుచ్చమ్మ, కార్యవర్గ సభ్యులు దుర్గయ్య, బుచ్చయ్య, రమేశ్, రవికుమార్, కొమురయ్య, ఎస్ రమేశ్, వెంకటస్వామి, కాంతయ్య, పద్మ, రాజేందర్ ఉన్నారు.

నేడు స్వచ్ఛదనం పచ్చదనంపై ర్యాలీ

పెద్దపల్లి, ఆగస్టు4: పెద్దపల్లిలో సోమవారం స్వచ్ఛదనం -పచ్చదనంపై అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5 నుంచి 9 దాకా నిర్వహించే స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా తొలి రోజు ఉదయం 9 గంటలకు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి తిరిగి కళాశాల మైదానం వరకు ర్యాలీ ఉంటుందని తెలిపారు. ర్యాలీలో పట్టణ ప్రజలు, అధికారులు, సిబ్బం ది పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

'ఖని'లో ఫ్రెండ్ షిప్ డే

కోల్‌సిటీ, ఆగస్టు 4: గోదావరిఖనిప్రధాన చౌరస్తాలో ఆదివారం స్నేహితుల దినోత్సవం నిర్వహించారు. వివిధ పార్టీల నాయకులు కలిసి కేక్ కట్ చేసి స్వీట్లు తినిపించుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. గోదావరిఖని పారిశ్రామిక ప్రాంత అభివృద్ధికి అందరం స్నేహ పూర్వకంగా కలిసిమెలిసి ఉంటామన్నారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు చెరుకు బుచ్చిరెడ్డి, పోలు భాస్కర్, సన్ని, ఎండీ హమీద్, మహంకాళి అంజయ్య, బెండె నాగభూషణం, రవీందర్, లక్ష్మీనర్సయ్య, శ్రీను, బాలసాని స్వామి, మండ రమేశ్, రాజు, గంగాధర్, వెంకటి పాల్గొన్నారు.

జ్యోతినగర్ (రామగుండం), ఆగస్టు 4: ఐక్య స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం ఎన్టీపీసీలోని అన్నపూర్ణ కాలనీలో స్నేహితుల దినోత్సవం నిర్వహించారు. కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసుకున్న నాయకులు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు ఒకరినొక్కరు కట్టుకొని ఆనందం వ్యక్తం చేశారు. ఐక్య స్వచ్ఛంద సంస్థల అధ్యక్షుడు మంచికట్ల దయాకర్, ఐత శివ కుమార్, మద్దెల దినేష్, చందు యాదవ్, గోలివాడ చంద్రకళ, కంది సుజాత, బిల్లా శ్రీదేవి, గాదం సరిత, మేడిఊడగోని స్వప్న, కొండు రమాదేవి, కందుకూరి శాంతి, సుభద్ర, భవానీ, సౌజన్య, రమాదేవి, స్వరూప, రాజేశ్వరి, దేవి ఉన్నారు.

ఫర్టిలైజర్‌సిటీ, ఆగస్టు 4: గోదావరిఖని ప్రధానచౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దీటి బాలరాజ్ ఆధ్వర్యంలో ఆదివారం పార్టీలకు అతీతంగా స్నేహితుల దినోత్సవం నిర్వహించారు. కేక్‌కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేసుకున్న నాయకులు ప్రతీ ఒక్కరూ స్నేహపూర్వకంగా కలిసిమెలిసి ఉండాలని కోరుకున్నారు. ఇక్కడ నాయకులు చెరుకు బుచ్చిరెడ్డి, పోలు భాస్కర్, మోహిత్ సన్నీ, ఎండీ హమీద్, మహంకాళి స్వామి, అంజయ్య, నాగభూషణం, పెద్దపల్లి రవీందర్, సుల్వ లక్ష్మీనర్సయ్య, జనహిత శ్రీను, బాలసాని స్వామిగౌడ్, మండ రమేశ్, అప్పరాజు, గంగాధర్, వెంకటి, తదితరులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ప్రముఖ కార్పొరేట్ కాలేజ్ నందు పని చేయుటకు మార్కెటింగ్ అనుభవంగల యువతీ యువకులు కావలెను. జీతం: 35K+TA, అర్హత: గ్రాడ్యుయేషన్, ఏరియా: కరీంనగర్ మరియు పరిసర ప్రాంతాలవారు సంప్ర: 7731069689.
NT-332611

WANTED

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899 / 9640468899.
NT-325783-All

PUBLIC HEALTH CHEMICALS
టెమీ ఫాస్ 50% EC, మలాథియన్ 50% EC, పైరిత్రమ్ 2% EC, డెల్టామెత్రిన్ 1.25% ULV, MLO ఆయిల్, పైరోసిన్ ఆయిల్ etc. మునిసిల్ కార్పొరేషన్స్‌కి, గ్రామ పంచాయతీలకి మరియు నగర పంచాయతీలకి సప్లై చేయబడును. డీలర్స్ మరియు మునిసిపల్ కాంట్రాక్టర్స్ సంప్రదించవలసిన నంబర్లు
9346771599, 8790185234, 9701298656

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194